సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



ధనుర్మాస ఉత్సవాలకు వేళాయె

ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంతో పాటు వైష్ణవాలయాల్లో సోమవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 8లో ▸



వణికిస్తున్న చలిపులి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 రోజుల నుంచి చలిగాలుల తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు కూడా భారీగా తగ్గాయి. 8లో ▸



ఆర్చరీ సెలెక్షన్స్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్చరీ సబ్ జూనియర్ సెలెక్షన్లు భీమవరం లోని ఓల్గా ఆర్చరీ అకాడమీలో ఉత్సాహంగా జరిగాయి. 8లో ▸

ఊరికి.. బంధువులొస్తున్నారు!


దూడూ బసవన్నల విన్యాసాలు (ఫైల్)

హరిలో రంగ హరి.. అంటూ హరిదాసులు.. అయ్యగారికి దండం పెట్టు.. అంటూ దూడూబసవన్నలు.. అంబ పలుకు అంటూ.. జంగమ దేవరలు.. కొమ్మదాసులు విన్యాసాలతో పెద్ద పండుగను నెల రోజుల ముందే వెంటేసుకొస్తారు.. సంక్రాంతికి అందరి ఇళ్లకు బంధువులు పండుగకు ముందు వస్తే.. 'ఊరికి బంధువులు' మాత్రం 'నెల'గంట మోగిన వెంటనే ఇళ్ల ముందు ప్రత్యక్షమవుతూ సందడి చేస్తారు.. సంప్రదాయ కళలకు పట్టం గడుతూ.. ధనుర్మాసంలో ఊరూవాడా తిరుగుతుంటారు. సోమవారం నుంచి ధనుర్మాసం ప్రారంభం కానుంది.



కళకళలు.. సందళ్లు

- రేపటి నుంచి ధనుర్మాసం
- పెద్ద పండుగకు మోగనున్న నెలగంట
- హరిదాసులు, గంగిరెద్దు, కొమ్మదాసులు, జంగమ దేవరల రాక
- నెల రోజులపాటు సందడి చేయనున్న సంప్రదాయ కళలు

సాక్షి, భీమవరం: సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించడంతో ధనుర్మాసం మొదలవుతుంది. దీనిని ధనుస్సంక్రమణమని, నెల పట్టడం అని పల్లె నానుడి. ఈనెల 16వ తేదీ (సోమవారం) నుంచి ధనుర్మాసం ప్రారంభం కానుంది. జనవరిలో మకర సంక్రమణం వరకు ధనుర్మాసం ఉంటుంది. ఈ నెలరోజుల పాటు ఉదయాన్నే హరినామ సంకీర్తలు పాడుతూ హరిదాసులు, దూడూ బసవన్నలతో విన్యాసాలు చేయిస్తూ గంగిరెద్ల వారు, పప్పుదాకలో పడిపోతున్నానంటూ కొమ్మదాసులు, అంబ పలుకు జగదంబ పలుకంటూ బుడబుక్కల వాళ్లు, శంఖం ఊదుతూ జంగమ దేవరలు, ఏడాదికో మారంటూ పిట్టల దొరలు, భట్రాజులు, సోదెమ్మలు, పగటి వేషగాళ్లు, కనికట్టు చేసేవాళ్లు, గారడీ చేసే వాళ్లు వరుసగా క్యూ కడుతుంటారు. ఆయా జాతుల వారు ఊళ్లను పంచుకుని తమతమ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తమ కళలను ప్రదర్శించి వినోదాన్ని పంచి యజమానులు ఇచ్చిన మొత్తాన్ని తీసుకువెళుతుంటారు. పల్లె జీవనానికి ఈ సంప్రదాయ కళలకు ఎంతో అనుబంధం ఉందని పెద్దలు చెబుతుంటారు. మారుతున్న కాలంలో ఆదరణ తగ్గి ఉపాధి కోసం జిల్లాలోని చాలా మంది కళాకారులు వేరే వృత్తుల్లో స్థిరపడగా, కొందరు మాత్రం తమ తాతల కాలం నుంచి వస్తున్న **విద్యను** ప్రదర్శిస్తూ సంప్రదాయ **కళలను** కాపాడుకుంటూ వస్తున్నారు. **సోమ**వారం నుంచి ఊరూరు తిరి**గేందుకు** సన్నాహాలు చేసుకుంటున్నా**రు.**


పల్లెలకు వస్తున్న సంక్రాంతి కళాకారులు (ఫైల్)


కొమ్మదాసు (ఫైల్)

కొమ్మదాసు గారడీ

ఓ లప్పో.. లచ్చిమప్పో.. నీపప్పు దాకలో పడిపోతానప్పో. అక్కో రాఖీ పండక్కొచ్చినప్పుడు నీకు షాపింగ్‌మాల్‌లోంచి కాస్ట్లీ చీరతెత్తానప్పా.. మాయగారు ఆనందంగా ఉండాల. వారానికి మూడు సినిమాలకు వెలతుండాల.. ఎక్కడికెళ్లినా జయం కలగాల.. నీ కుటుంబమంతా బాగా ఉండాల అంటూ కొమ్మదాసులు మాటల గారడీ చేస్తూ ఆకట్టుకుంటారు. పూర్వం చెట్లు ఎక్కి హడావుడి చేసేవారు. ఇప్పుడు భుజాన కొమ్మేసుకుని తిరుగుతున్నారు.

శ్రీమద్ రమా రమణ గో**విందో..**

శ్రీమద్ రమా రమణ గోవిం**దో హరి.. అం**టూ తెలవారకుండానే ను**దుటన తిరునా**మం, నెత్తిన అక్షయపాత్ర**, చేతిలో చిడతలు,** భుజాన తంబూర, పట్టు**ధోవతి పంచెకట్టు, మెడలో** మాల, కాళ్లకు గజ్జలతో **హరిదాసులు వీధివీధి** తిరుగుతూ హరినామ సంకీర్తనలు ఆలపించడం అనాదిగా వస్తున్న ఆచారం. వారు నడయాడిన గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉంటుందని, హరిదాసు అక్షయపాత్రలో పోసే కాసి బియ్యం తమ ఇంటిని సిరిసంపదలతో నింపుతాయని పల్లె ప్రజలు భావిస్తారు. పండుగ నెల పట్టారంటే ప్రతిరోజూ ఉదయాన్నే ప్లేటులో బియ్యంతో మహిళలు హరిదాసు రాకకోసం ఇంటి ముంగిట వేచి ఉండటం పల్లెల్లో కనిపిస్తుంది. గ్రామాలు విస్తరించడంతో రోజులో ఊరంతా నడవలేక కొందరు హరిదాసులు ద్విచక్ర వాహనాలపై తిరుగుతున్నారు.


జంగమ దొర (ఫైల్)

బుడబుక్కల వారు.. జంగమ దేవరలు

అంబ పలుకు.. జగదంబ **పలుకు అంటూ తల** పాగా, కోటు **ధరించి** ఢమరకం **వా**యిస్తూ భవి**ష్య**త్తు శుభాలు **చె**బుతూ బుడబు**క్క**ల వారు వస్తే.. **త**లపాగా, పం**చె**కట్టు ధరించి ఓ **చేతితో శంఖం** ఊదుతూ మరో **చేతితో గంట** వాయిస్తూ జం**గమ దేవర**లు ఇంటింటికీ **వస్తుం**టారు.


హరిదాసు (ఫైల్)

దూడూ బసవన్నల విన్యాసాలు

అయ్యగారికి దండం పెట్టు.. అమ్మగారికి దండం పెట్టు అంటూ యజమానికి చెప్పే ఆదేశాలకు తలాడిస్తూ గంగిరెద్దు చేసే విన్యాసాలు అబ్బురపరుస్తాయి. సంక్రాంతికి గంగిరెద్దులతో విడదీయలేని అనుబంధం ఉంది. దూడూ బసవన్నల రూపంలో ఇంటి ముందుకొస్తేనే పండుగ హడావుడి మొదలవుతుంది. గంగిరెద్ల వారు పీపీలు ఊదుతూ పాటలు పాడుతుంటే గంగిరెద్దుల ఘల్.. ఘల్‌మనే గజ్జల చప్పుడు మధ్య తమ ఇంటికి లక్ష్మీ కళ వస్తుందని పల్లె ప్రజలు భావిస్తారు.



తాతల కాలం నుంచి..



మా తాతల కాలం నుంచి గంగిరెద్లు ఆడిస్తున్నాం. ఎన్నో ఏళ్లుగా మేం అదే వృత్తిని కొనసాగిస్తూ వస్తున్నాం. సంక్రాంతి ముందు నెల రోజులు మా పరిధిలోని అన్ని గ్రామాల్లో గంగిరెద్లు ఆట ఆడిస్తాం. మిగిలిన రోజుల్లో అప్పుడప్పుడూ ఈ ఆటకు వెళుతుంటాం.

– చింత దుర్గయ్య, గంగిరెద్ల కళాకారుడు, పెనుమంట్ర

జంగమ దేవరగా..



నెల రోజుల పాటు జంగమ దేవరగా గ్రామమంతా తిరుగుతాను. గతంలో మాదిరి ఇప్పుడు ఆదరించేవారు లేక ఉపాధి కోసం మా పిల్లలు వేరే పనుల్లోకి వెళ్లిపోయారు. ఖాళీ రోజుల్లో మేం పనుల్లోకి వెళ్లిపోతుంటాం. మా చిన్నతనంలో రైతులు వడ్లు పోసేవారు.

– అనచంద్ర ధనకొండ, కళాకారుడు, మేడపాడు

న్యూస్‌రీల్

గోదావరి కాలుష్యంపై ముగిసిన పరిశీలన


మాట్లాడుతున్న ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం: నరసాపురం వశిష్ట గోదావరి ఒడ్డున మున్సిపాలిటీ చెత్తను డంప్ చేస్తున్న ప్రాంతంలో జాతీయ కాలుష్య నియంత్రణ మండలి చేపట్టిన పరిశీలన శనివారం ముగిసింది. జాతీయ కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ డైరెక్టర్ హెచ్‌డీ వరలక్ష్మితో కూడిన కమిటీ రెండో రోజూ నరసాపురంలో పర్యటించింది. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆర్డీఓ దాసి రాజు వివరాలు వెల్లడించారు. ట్రిబ్యునల్ కమిటీలో తాను కూడా సభ్యుడినేనన్నారు. మండలి సభ్యులు చెత్త డంప్ చేస్తున్న ప్రాంతం, సమీపంలో నీరు, మట్టికి సంబంధించి తొమ్మిది శాంపిల్స్ సేకరించారన్నారు. అలాగే మూడు చోట్ల మెషీన్లు పెట్టి గాలి నాణ్యత పరీక్షలకు రీడింగ్స్ తీశారన్నారు. గోదావరి వద్ద చెత్తను నేరుగా వేయొద్దని ఆదేశించారని చెప్పారు. చెత్తను శుభ్రం చేసి మాత్రమే వేయాలని, తడిపొడి చెత్తను వేరు చేసి జాగ్రత్తలు తీసుకోవాలని బృంద సభ్యులు సూచించారన్నారు. డంపింగ్ యార్డ్ వేరే ప్రాంతంలో ఏర్పాటుకు మున్సిపాలిటీ గతం నుంచి చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ద్రోహం


ఉండి సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

ఉండి: అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులు తగ్గిస్తామని నమ్మించి.. గద్దెనెక్కిన తర్వాత చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు తీరని ద్రోహం చేసిందని సీపీఎం జిల్లా నాయకుడు ధనికొండ శ్రీనివాస్ అన్నారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ఉండి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పెంచిన విద్యుత్ చార్జీలు, సర్దుబాటు చార్జీలపై ఆందోళన చేపట్టారు. విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రూఅప్, సర్దుబాటు చార్జీల పేరుతో బిల్లులు పెంచడం దారుణమన్నారు. నాయకులు వీరవల్లి మాధవరావు, కొట్టాడ వెంకటేశ్వరరావు, మోపిదేవి రాము, కాళ్ల యేసు పాల్గొన్నారు.

17 నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఈనెల 17 నుంచి ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపు లను నిర్వహించనున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈనెల 17 నుంచి 20 వరకు, మరలా ఈనెల 26 నుంచి 28 వరకు జిల్లాలో మొత్తం 90 క్యాంపులు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.

ఆక్రమణదారుడిపై కేసు నమోదు చేయాలి


ఆర్డీఓ కార్యాలయం వద్ద వినతిపత్రం ఇస్తున్న చీకటిమిల్లి మంగరాజు, దళిత సంఘాల నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, దళిత ప్రజా సంఘాలు రాపాక వెంకటేశ్వరరావు, జి.విజయ్‌కుమార్, గుంపుల సత్యకృష్ణ, మరపట్ల రాజులు ప్రశ్నించారు. వివరాలతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు శనివారం అందజేశారు. కబ్జా చేసేందుకు ప్రయత్నించిన మాజీ కౌన్సిలర్‌పై కేసు నమోద చేయాలని, స్థలంలో ఉన్న మెటీరియల్‌ను డంపింగ్ యార్డుకు తరలించాలని, అన్న క్యాంటీన్‌లో ఉన్న విద్యుత్‌ను కబ్జాదారులు నిర్మాణం చేపట్టే సమయంలో వాడుకున్నారని, వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఈలి సత్యనారాయణ ఉన్న సమయంలో ఎస్సీ కాంప్లెక్స్ నిర్మాణానికి అన్న క్యాంటీన్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాట్లు జరిగాయని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విలేకరులపై దాడి హేయం


ఏఎస్పీ భీమారావుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరం: జర్నలిస్టులపై దాడులను నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో శనివారం భీమవరంలో నిరసన తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం వద్దకు ప్రదర్శనగా వెళ్లి అడిషినల్ ఎస్పీ వి.భీమారావుకు వినతిపత్రం అందించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వీఎస్ సాయిబాబా, భీమవరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కడలి వరప్రసాద్ మాట్లాడుతూ కడప జిల్లాలో 'సాక్షి' విలేకరులపై టీడీపీ నాయకులు దాడిచేయడం దారుణమన్నారు. అలాగే హైదరాబాద్‌లో టీవీ 9 విలేకరిపై సినీ నటుడు మోహన్‌బాబు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు కేఎస్ఆర్‌కే గోపాలకృష్ణ, కార్యవర్గ సభ్యుడు వంగల నాగేశ్వరలింగమూర్తి, బి.రామాంజనేయులు, శ్రీనివాస్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్ ప్రారంభం


ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ధర్మ ప్రచారకర్త త్రిదిండి అహోబిల రామానుజ జీయర్ స్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): సాయి సిల్క్స్ కళామందిర్ లిమిటెడ్ తమ కార్యకలాపాలను విస్తృతం చేయడంలో భాగంగా తమ సంస్థ ప్రముఖ చీరల బ్రాండ్ కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్‌ను తాడేపల్లిగూడెం కేఎన్ రోడ్డులో శనివారం ఘనంగా ప్రారంభించారు. ఆధ్యాత్మిక ధర్మ ప్రచారకర్త త్రిదిండి అహోబిల రామానుజ జీయర్ స్వామి, ఇతర ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై షోరూమ్‌ను ప్రారంభించారు. డైరెక్టర్ రాజేష్ అన్నం మాట్లాడుతూ తమ సంస్థ 64వ షోరూమ్‌ను తాడేపల్లిగూడెంలో ఏర్పాటుచేయడం ఆనందంగా ఉందన్నారు. స్వచ్ఛమైన కంచిపట్టు చీరలు, హ్యాండ్లూమ్, బనారస్, పటోలా, కోట, పైథాని, కుప్పడం, ప్రీమియం ఎత్నిక్ అన్నిరకాల చీరలు అత్యంత తక్కువ ధరలకు లభిస్తాయని తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులో వివిధ బ్రాండ్స్ రూపంలో కార్యకలాపాలు నిర్వర్తిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో 7వ షోరూమ్‌ను ఇక్కడ ప్రారంభించామన్నారు. కాంచీపురంలో అతి పెద్ద షోరూమ్ ఉందని, తమ వద్ద సొంత మగ్గాలు, చేనేత కార్మికులు ఉండటంతో మార్కెట్‌లో మరెవరూ ఇవ్వలేని క్వాలిటీతో తక్కువ ధరలతో బ్రాండ్ ఐటమ్ ఇవ్వగలుగుతున్నామని తెలిపారు. ఇటీవల సాయి సిల్క్స్ కళా మందిర్ లిమిటెడ్ ఐపీఓ ద్వారా స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశించిన విషయం తెలిసిందేనని రాజేష్ అన్నారు.

పశువధ శాలను మూసేయాలి

తణుకు టౌన్: తణుకు మండలం తేతలి గ్రామంలోని పశువధ శాలతో పరిసర ప్రాంతాల్లో పర్యావరణ, ప్రజారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముందని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్‌కు లేఖ రాశారు. శనివారం లేఖ ప్రతిని విలేకరులకు పంపించారు. తేతలి శివారులో ఏర్పాటు చేసిన లేహ్యాం ఫుడ్ ప్రొడక్ట్స్ పరిశ్రమకు ముందుగా శీతల గిడ్డంగిగా అనుమతులు తీసుకుని పశువులను వధించి మాంసాన్ని ఎగుమతి చేసే కార్యకలాపలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఇక్కడ పశువధ జరగలేదని, ఇటీవల పశువధ చేయడంపై గ్రామస్తులు ఆందోళనలు చేపట్టారన్నారు. దుర్గంధంతో ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపే ఇలాంటి సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పరిశ్రమ కారణంగా తణుకు పరిసర ప్రాంతాల్లో గేదెలు, పశువుల దొంగతనాలు పెరిగిపోతున్నాయన్నారు. ఈ పరిశ్రమను మూసి వేయాలని ఆదేశించాలని లేఖలో కోరామన్నారు.

కుమార్తెను ఇచ్చి పెళ్లి చేయలేదని..

- వ్యక్తిని హతమార్చిన యువకుడు
- ఏలూరులో దారుణ హత్య


ఏలూరులో కనకరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ఒక వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. నగరంలోని రామకృష్ణాపురం రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి 39వ పిల్లర్ వద్ద ఒక వ్యక్తి విగతజీవిగా పడి ఉండటాన్ని శనివారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఏలూరు త్రీటౌన్ సీఐ ఎస్.కోటేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలించారు. హత్యకు గురైనట్టుగా ప్రాథమిక అంచనాకు వచ్చిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి కుమార్తెను పెళ్లి చేసుకుంటానని ఒక యువకుడు వేధిస్తూ ఉండగా.. అతనే ఈ హత్య చేసినట్టు పోలీసులు నిర్ధారించారు.

ఆర్వోబీ 39వ పిల్లర్ వద్ద..

నగరంలోని రామకృష్ణాపురం రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి 39వ పిల్లర్ ప్రాంతంలో షేక్ వెంకటకనకరాజు అలియాస్ బెగ్గర్‌రాజు, నాగమణి దంపతులు గతంలో నివాసం ఉండేవారు. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉండగా కనకరాజు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడి భార్య మృతి చెందగా.. పెద్ద కుమార్తె (బాలిక)ను ఏలూరు రూరల్ వెంకటాపురం ప్రాంతానికి చెందిన నాని అనే యువకుడు ప్రేమ పేరుతో గతంలో వేధించేవాడు. పెళ్లి చేయమని కనకరాజును సైతం వేధిస్తూ ఉండగా నానితో పలుమార్లు గొడవ జరిగిందని స్థానికులు చెబుతున్నారు. భార్య మృతిచెందటంతో కుమార్తెలు ముగ్గురినీ తీసుకుని కనకరాజు ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామంలో ఉంటున్నాడు. తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

పక్కా పథకం ప్రకారం..

నారాయణపురంలో ఉంటున్న కనకరాజు ఈనెల 13న గతంలో నివాసం ఉన్న రామకృష్ణాపురం ప్రాంతానికి రాగా ఊహించని విధంగా తెల్లవారేసరికి విగతజీవిగా పడి ఉన్నాడు. మృతుడి బంధువులు ఎవరూ లేకపోవటం, రాత్రి వేళ ఏం జరిగిందో తెలియని పరిస్థితి పోలీసులకు సవాల్‌గా మారింది. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐ కోటేశ్వరరావు హత్య పన్నాగాన్ని ఛేదించారు. శుక్రవారం ఆర్వోబీ పిల్లర్ 29 వద్దకు వచ్చిన కనకరాజు పక్కనే నివాసం ఉంటున్న నాగిరెడ్డి గంగలక్ష్మిని పలకరించి, ఈ రోజుకు ఇక్కడే ఉంటాననీ చెప్పాడు. విషయం తెలిసిన నాని రాత్రి కనకరాజు వద్దకు వచ్చి పెళ్లి విషయాన్ని ప్రస్తావించాడు. కుమార్తెను పెళ్లి చేయాలని అడగ్గా కనకరాజు కుదరదని చెప్పాడు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య గొడవ జరగడంతో నాని తనతో పాటు తెచ్చుకున్న పదునైన చాకుతో గొంతుపై పలుమార్లు పొడవటంతో కనకరాజుకు తీవ్ర గాయమైంది. ఈ క్రమంలో కనకరాజు మృతిచెందగా నాని అక్కడి నుంచి పరారయ్యాడు. కనకరాజు మృతదేహాన్ని పోలీసులు ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. హత్యకు సంబంధించి అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కోటేశ్వరరావు స్పష్టం చేశారు. నాని అనే యువకుడు ఒక్కడే ఉన్నాడా ? లేక ఇంకా ఎవరైనా సహకరించారా అనే కోణంలోనూ విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్



జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్

ఏలూరు (టూటౌన్): కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ దోహదపడుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాసదన్ భవన్‌లో శనివారం జాతీయ లోక్ అదాలత్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఈ ఏడాదిలో నాల్గో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. రాజీయోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ వివాద కేసులు, వాహన ప్రమాద కేసులను రాజీ చేసుకోవచ్చని చెప్పారు. నెల రోజులుగా జిల్లావ్యాప్తంగా అన్ని కోర్టుల పరిధిలో కక్షిదారులతో మధ్యవర్తిత్వం నిర్వహించామన్నారు. ప్రత్యక్షంగా హాజరుకాలేని కక్షిదారులు ఆన్‌లైన్ ద్వారా కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి, ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్‌కుమార్, పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి ఎస్.ఉమా సునంద, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బులి కృష్ణ, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనె సీతారాం, ప్రభుత్వ న్యాయవాది బీజే రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు అబ్బినేని విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

4,985 కేసుల పరిష్కారం : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కోర్టులున్న అన్ని ప్రదేశాలలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రాత్రి 7 గంటల సమయానికి మొత్తం 4,985 కేసులను పరిష్కరించినట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. రాజీ చేసిన పెండింగ్ కేసుల్లో 323 సివిల్ కేసులు, 4,662 క్రిమినల్ కేసులు, 71 ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నాయన్నారు.

క్లుప్తంగా

చెస్ బ్రోచర్ విడుదల



చదరంగం పోటీల బ్రోచర్ విడుదల చేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ రాపిడ్ అండ్ బ్రిడ్జ్ చదరంగం పోటీలు ఈ నెల 24, 25 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో నిర్వహిస్తున్నట్లు ప్రియదర్శిని కాలేజ్ కరస్పాండెంట్ అలుగు ఆనంద్ శేఖర్ తెలిపారు. పట్టణంలో శనివారం చెస్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. 2011లో చెస్ పోటీలు నిర్వహించామని, మరలా ఇప్పుడు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రావూరి కృష్ణ, చిన్ని హరీష్‌గుప్త, సచివరపు బుల్లయ్య, సమయమంత్రి రాధాకృష్ణ, పాతూరు అంబేద్కర్, సమయమంత్రి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ నిత్యాన్నదాన ట్రస్ట్‌కు కూరగాయల వితరణ



టీటీడీ నిత్యాన్నదాన ట్రస్ట్‌కు కూరగాయలను పంపిస్తున్న చింతలపూడి భక్తులు

చింతలపూడి: తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్నదాన ట్రస్ట్‌కు చింతలపూడికి చెందిన వేంకటేశ్వరస్వామి భక్తులు 12 టన్నుల కూరగాయలను అందజేశారు. శనివారం టీటీడీ దేవస్థానం వాహనంలో కూరగాయలను తిరుపతికి పంపించారు. ఈ సందర్భంగా చింతలపూడి మండలానికి చెందిన భక్తులు యర్రంశెట్టి రామకృష్ణారావు, శెట్టిపల్లి మోహన్‌బాబు, ఆర్ నాగేశ్వర్రావు, అత్తిలి సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఏటా తిరుపతి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు కూరగాయలను పంపిస్తామని ఈ ఏడాది కూడా పంపినట్లు తెలిపారు. పెద్ద తిరుపతితో పాటు ద్వారకాతిరుమల నిత్యాన్నదాన ట్రస్ట్‌కు కూడా 4 టన్నుల కూరగాయలను పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి పులి

- ఉమ్మడి పశ్చిమలో పెరిగిన చలిగాలులు
- వరుస అల్పపీడనాలతో మరింత ఉద్ధృతం
- భారీగా తగ్గిన పగటి ఉష్ణోగ్రతలు





నరసాపురం వాతావరణ శాఖ ఆటోమెటిక్ వెదర్ స్టేషన్ వద్ద గాలుల తీవ్రతను సూచించే ఎనిమోమీటర్

నరసాపురం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గత 15 రోజుల నుంచి చలిగాలుల తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు కూడా భారీగా తగ్గాయి. ఈశాన్య రుతుపవనాలు, తమిళనాడులో ఏర్పడ్డ తపాను, అలాగే బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాల నేపథ్యంలో పగటిపూట కూడా చలిగాలుల తీవ్రత గణనీయంగా పెరిగాయి. దీంతో పశ్చిమ, ఏలూరు జిల్లాల వాసులు చలిగాలులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శీతాకాలం ప్రవేశించినప్పటికీ ఈ ఏడాది చలిగాలులు ప్రభావం కాస్త ఆలస్యంగా కనిపించింది. నిజానికి అక్టోబర్ చివరి నాటికే చలిగాలులు పెరుగుతాయి. మంచు పట్టడం కూడా ప్రారంభమవుతుంది. అయితే ఈ ఏడాది డిసెంబర్ వచ్చాక శీతాకాల ప్రభావం కనిపిస్తోంది. ఆలస్యంగా ప్రారంభమైనా చలిగాలుల ప్రతాపం తీవ్రంగా చూపించడం విశేషం. గత 15 రోజులుగా ఉమ్మడి పశ్చిమలో సాధారణంతో పోలిస్తే 3 నుంచి 6 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు తగ్గాయి. అటు రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గడం, గాలిలో ఉండే తేమశాతంలో భారీ హెచ్చుతగ్గులు నమోదు కావడం జరుగుతుంది. దీంతో జనాన్ని ఒకింత ఇబ్బందిపెట్టే వాతావరణం ఉమ్మడి పశ్చిమలో కొనసాగుతోంది. ప్రస్తుతం జిల్లాలో పగటిపూట సగటున 30–32 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రాత్రిపూట 20–22 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. పగటిపూట గాలిలో తేమశాతం 56 నుంచి 60శాతం మధ్య నమోదు అవుతుంది. రెండు వారాల క్రితం పరిస్థితి తీసుకుని అంచనా వేస్తే పగటిపూట గాలిలో తేమశాతం 5 వరకూ తగ్గిందని నరసాపురం వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. రాత్రి పూట గాలిలో తేమశాతం గరిష్ఠంగా 96 వరకూ నమోదు అవుతుంది. 15 రోజుల క్రితం నాటి పరిస్థితిని పరిగణలోకి తీసుకుంటే రాత్రిపూట నమోదయ్యే తేమశాతం మధ్య వ్యత్యాసం 15 నుంచి 20 వరకూ ఉంది. దీంతో రాత్రిపూట చలితీవ్రత పెరగడమే కాకుండా వృద్ధులు, పిల్లలు, ఆస్మా, ఇతర దీర్ఘకాల రోగాలతో బాధపడేవారికి వాతావరణం ఇబ్బందిగా మారింది. జనవరి చివరి వరకూ చలిగాలుల ప్రభావం జిల్లాలో ఇదే స్థాయిలో ఉంటుందని నరసాపురం వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

తపానులు, అల్పపీడనాలతో మరింత తీవ్రం

తమిళనాడులోని చెన్నైతో సహా వారం రోజుల క్రితం తుపాను ప్రభావంతో అధిక వర్షాలు పడ్డాయి. ఇక మనకు గత 15 రోజుల వ్యవధిలో బంగాళాఖాతంలో రెండుసార్లు అల్పపీడనాలు ఏర్పడ్డాయి. ఈ తాలూకా వాతారణ ప్రభావం కోస్తాపై ఉందని విశాఖపట్టణం వాతావరణశాఖ అధికారులు ఇప్పటికే తెలియజేశారు. అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య సాధారణంగా ఉండే ఈశాన్య రుతుపవనాల ప్రభావం తమిళనాడుతో పాటుగా మనకూ కొంత మేర కనిపిస్తోంటుంది. అటు నుంచి వచ్చే గాలుల ప్రభావం కొంతమేర గోదావరి జిల్లాలపై ఉంటాయి. ఈనేపథ్యంలో తమిళనాడులో తుపాను పట్టడం, మనకు బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాలు ఏర్పడటం లాంటి కారణాలతో ఉమ్మడి పశ్చిమలో చలిగాలుల తీవ్రత బాగా పెరిగిందని అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో చలిగాలు తీవ్రత జిల్లాపై మరింత ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



సీజన్ మారినప్పుడల్లా వాతావరణంలో మార్పులు వస్తుండడం సహజమే. అయితే వాతావరణ మార్పుల కారణంగా కొందరిలో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ప్రస్తుతం చలి తీవ్రత పెరిగినందున అలాంటి వారు జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులు, చంటి పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఉదయం చలిగాలుల్లో వృద్ధులు వాకింగ్ చేయడం మానుకోవాలి. సాయంత్రం పూట, ఇళ్లలోనే చేసుకోవడం ఉత్తమం. ఆస్మా రోగులు జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ బళ్ల మురళి, ఎండీ, తులసీ హాస్పటల్, నరసాపురం

ఆర్చరీ సబ్ జూనియర్ సెలెక్షన్స్



భీమవరంలో ఆర్చరీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

భీమవరం : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్చరీ సబ్‌జూనియర్ సెలెక్షన్లు శనివారం భీమవరంలోని ఓల్గా ఆర్చరీ అకాడమీలో జరిగాయి. ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో కాంపౌండ్ ఉమెన్ కేటగిరిలో ఎం సూర్యహంసిని, కె శరణ్య, కె సుస్మిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజయం సాధించగా వి.స్ఫూర్తి, కె సమీక్షారెడ్డి, ఎ కనిష్క తరువాత స్థానాల్లో నిలిచారని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్ జయరాజు, కోచ్ ఇ సాహిత్ వెల్లడించారు. కాంపౌండ్ మెన్ కేటగిరిలో ఎం సుహాస్, సీహెచ్ హర్షికేశ్‌నాయుడు, రికర్వ్ మెన్ కేటగిరిలో టి.యశ్వంత్, కె శరత్‌చంద్ర ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచారన్నారు. రికర్వ్ ఉమెన్ కేటగిరిలో కె కృష్ణసాత్విక్ ప్రథమ స్థానంలోను ఇండియన్ రౌండ్ కేటగిరిలో పి అర్జున్‌వర్మ, పి రిత్విక్, సి హర్షద్ ఎంపికైనట్లు తెలిపారు. విజేతలు ఈనెల 23వ తేదీ నుంచి రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు.

'జీవన సౌందర్యం'కు బహుమతి

గాయాలను లెక్కచేయని కవి హృదయం



శ్రీనివాసరావు, రచయిత

పాలకొల్లు అర్బన్: గాయాలను సైతం లెక్కచేయకుండా హృదయంతో స్పందించి రాసిన కథకు బహుమతి లభించింది. ప్రముఖ కవి, రచయిత మామిడిశెట్టి శ్రీనివాసరావు గత అక్టోబర్‌లో రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నవంబర్‌లో ముట్నూరి కమలమ్మ ఫౌండేషన్, సాహితీ కిరణం సంయుక్తంగా నిర్వహించిన జాతీయస్థాయి చిన్న కథల పోటీలకు శ్రీనివాసరావు చికిత్స పొందుతూనే 'జీవన సౌందర్యం' కథ రాసి పంపించారు. ఈ పోటీలకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి 214 కథలు రాగా శనివారం వెల్లడించిన ఫలితాల్లో 6 సమాన బహుమతుల్లో 'జీవన సౌందర్యం' కథ నిలిచిందని కవి, రచయిత మామిడిశెట్టి శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వ్యక్తుల నిస్వార్థం, త్యాగం, శ్రమ, విలువల్ని శాంతమ్మ పాత్ర ద్వారా వివరిస్తూ కష్టాల్లోనే అవకాశాల్ని, కన్నీళ్లలోనే అవసరాల్ని వెతుక్కున్ని సాగించే జీవన పోరాటంలోనే అసలైన జీవన సౌందర్యం ఉందని నిరూపించిన ఈ కథకు బహుమతి లభించిందని ఆయన వివరించారు.

ధనుర్మాస ఉత్సవాలకు వేళాయె

- రేపటి నుంచి క్షేత్రంలో ఉత్సవాలు ప్రారంభం
- జిల్లా వ్యాప్తంగా ముస్తాబవుతున్న వైష్ణవాలయాలు
- 17 నుంచి చినవెంకన్న ఆలయంలో సుప్రభాత సేవ రద్దు
- తిరుప్పావై సేవాకాలాలు, గ్రామోత్సవాలు ప్రారంభం
- వచ్చేనెల 13న గోదారంగనాథుల కల్యాణం



క్షేత్రంలో ముస్తాబవుతున్న ధనుర్మాస మండపం



గోదాదేవి

ద్వారకాతిరుమల: వేదాల్లో సామవేదం, మాసాల్లో మార్గశిరం అత్యంత పవిత్రమైనవని భగవద్గీత మనకు చెబుతోంది. ఈ మాసంలో రంగనాథుడిని పరమభక్తితో సేవించడం ద్వారా గోదాదేవి ఆయనను వరించి, తన భక్తిని చాటుకుంది. సూర్యుడు వృశ్చిక రాశి నుంచి ధనుస్సు రాశిలోకి ఈనెల లోనే ప్రవేశిస్తాడు. ఈ 30 రోజుల కాలాన్ని ధనుర్మాసంగా పిలుస్తూ, విష్ణువును ప్రసన్నం చేసుకునేందుకు గోదాదేవి రోజుకో రీతిలో తిరుప్పావై పాశురాలను ఆలపించడం విశేషం. అందరూ ఆచరించే భగవద్గీత పుట్టింది కూడా ఈ మాసంలోనే. నెలగంట మోగిందంటే గ్రామాల్లో హరిదాసుల సందడి ప్రారంభం అయినట్టే.

వైష్ణవాలయాల్లో తిరుప్పావై ప్రవచనాలు

శ్రీవైష్ణవులకు తిరుప్పావై వ్రతం ముఖ్యమైంది. ఈ వ్రతంలో నెలరోజులపాటు రోజుకో పాశురం చొప్పున విన్నపం చేస్తారు. ఒకటి నుంచి 5 పాశురాలలో వ్రత విధానం, 6 నుంచి 15 పాశురాలలో తన తోటి చెలికత్తెలను నిద్రలేపి నందగోపుని గృహానికి వెళ్లడం, 16, 17, 18 పాశురాలలో నందగోపుడు, యశోద, బలరాములను మేల్కొలపడం, 23వ పాశురంలో మంగళాశాసనం, 25, 26 పాశురాలలో స్వామికి అలంకారాలైన ఆయుధాలలో పరా అనే వాయిద్యాన్ని తమ శరణాగతి అనుగ్రహించి, తమ సంకల్పాన్ని నెరవేర్చమని ప్రార్థిస్తారు. ఆఖరి రోజున గోదా రంగనాథుల కల్యాణాన్ని అట్టహాసంగా నిర్వహిస్తారు.

ఎంతో శుభప్రదం

విష్ణుమూర్తికి ప్రీతికరమైన ఈ ధనుర్మాసం ఎంతో శుభప్రదమైనది. అన్ని విష్ణు ఆలయాలు, వేంకటేశ్వర స్వామివారి ఆలయాల్లో నెలరోజులపాటు తిరుప్పావై పాశురాలను పఠిస్తారు. ఈ మాసంలో విష్ణుమూర్తిని మధుసూదనుడిగా పూజిస్తారు. పెళ్లికాని యువతులు ఇంటి ముందు ముగ్గులు, గొబ్బిళ్లతో పూజలు చేస్తే కోరుకున్న వరుడు దొరుకుతాడని ప్రతీతి. ఈ నెల రోజులూ శ్రీకృష్ణుడికి తులసి మాల సమర్పించే యువతులకు నచ్చిన వరుడితో వివాహం జరుగుతుందని పండితులు చెబుతున్నారు.

ముస్తాబవుతున్న ఆలయాలు

జిల్లాలోని వైష్ణవాలయాలు ధనుర్మాసోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. అందులో భాగంగా ద్వారకాతిరుమల క్షేత్రంలోని ప్రధాన కూడలిలో ఉన్న ధనుర్మాస మండపాన్ని రంగులతో ముస్తాబు చేస్తున్నారు. శ్రీవారి ఆలయంలో ఈ నెల 16న సాయంత్రం నెలపట్టడంతో ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు, జనవరి 14 వరకు జరుగుతాయి. నిత్యం ఆలయంలో మంగళ వాయిద్యాలు, తిరుప్పావై గానం, ఆండాళ్ కోవెల సేవలను నిర్వహిస్తారు. ప్రతి శుక్రవారం గోదాదేవికి కుంకుమార్చన చేస్తారు. ఈనెల 17 నుంచి ఉత్సవాలు ముగిసే వరకు ప్రతి రోజూ ఉదయం స్వామి, అమ్మవార్లు, అలాగే గోదాదేవికి గ్రామోత్సవాలను నిర్వహిస్తారు. జనవరి 13న భోగి పండుగ నాడు శ్రీవారి కల్యాణంతో పాటు, గోదా రంగనాథుల కల్యాణాన్ని అర్చకులు అట్టహాసంగా నిర్వహిస్తారు. ఈనెల రోజులు ఆలయంలో సుప్రభాత సేవలు రద్దు కానున్నాయి.

శుభాలు కలుగుతాయి



భక్తురాలైన గోదాదేవి రంగనాథుడిని స్తుతిస్తూ రోజుకో పాశురాన్ని 30 రోజుల పాటు గానం చేశారు. ఆమె స్వామిలో ఐక్యమవడంతో 30వ రోజున గోదాదేవి, శ్రీరంగనాథుల కల్యాణం నిర్వహిస్తారు. పాశురాలు పఠించినా, విన్నా, గోదా కల్యాణం తిలకించినా శుభాలు కలుగుతాయి. 12 మాసాల్లో ధనుర్మాసాన్ని వైష్ణవులు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ఈ నెలరోజులు వైష్ణవాలయాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. పలువురు భక్తులు ధనుర్మాస వ్రతాలను ఆచరిస్తారు.

– సుదర్శనం శ్రీనివాసాచార్యులు, ఆగమ పండితులు

ఏకపక్షంగా 'సాగునీటి' ఎన్నికలు



కాళ్ల మండలం సీసలిలో నీటి సంఘాల ఎన్నికల తీరును పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకపక్షంగా జరిగాయి. అలాగే కొన్ని సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. పశ్చిమ డెల్టాకు సంబంధించి మేజర్ ఇరిగేషన్, మైనర్ ఇరిగేషన్‌లకు 1,260 ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. కానీ 1,215 ప్రాదేశిక నియోజకవర్గాలకు మాత్రమే ఎన్నికలు నిర్వహించారు. మిగిలిన 45 ప్రాదేశిక నియోజవర్గాలకు ఎన్నికలు జరగలేదు. 112 నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపిక జరగాల్సి ఉండగా 110 నీటి సంఘాలకు అధ్యక్షులు, 109 నీటి సంఘాలకు ఉపాధ్యక్షుల ఎంపిక పూర్తి చేశారు. మొగల్తూరు మండలం కాళీపట్నం, మచ్చగడ నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపిక జరగాలి. దిరుసుమర్రు నీటి సంఘానికి ఉపాధ్యక్ష పదవికి ఎంపిక జరగాలి.

చోరీల కేసుల్లో ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కైకలూరు : ఇంటి తాళాలు, పైకప్పులు పగులగొట్టి దొంగతనాలు చేసే ముగ్గురు నిందితులను కైకలూరు టౌన్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వివరాలను కైకలూరు సీఐ పి.కృష్ణ, ఎస్సై డి.వెంకట్‌కుమార్ స్టేషన్‌లో వెల్లడించారు. ఈ నెల 3న కైకలూరు టౌన్ హాల్ ఎదుట పాముల కాలనీ సమీప రేకుల షెడ్డు తాళాలు పగలుగొట్టి బీరువాలో 56 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండి వస్తువులను దొంగిలించారు. యజమాని సీతారామయ్య టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి విచారించారు. దొంగతనానికి పాల్పడింది ఏలూరుకు చెందిన షేక్ మున్నా (19), పాట్నూరి హరి (22), ఉప్పాడ కార్తీక్‌సాయి(21)గా గుర్తించారు. వీరిలో మున్నాపై 2003లో కైకలూరు ఎన్జీవోస్ కాలనీలో చీరల దొంగతనం కేసుతో పాటు ఏలూరు, పెదపాడు, దెందులూరు, పెంటపాడు, నిడమర్రు, కాళ్ళ పోలీసు స్టేషన్లలో 10 దొంగతనం కేసులు నమోదయ్యాయి. హరిపై దుకాణాల దొంగతనాలు, కార్తీక్ సాయి వాహనాల దొంగతనాలపై జైలు జీవితం గడిపారు. కైకలూరు కేసులో వీరి వద్ద నుంచి 4 బంగారం, వెండి వస్తువులు, దొంగతనానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించటంలో ప్రతిభ చూపిన ఎస్సై వెంకట్‌కుమార్, సిబ్బందిని సీఐ అభినందించారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

భీమవరం: కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందాడు. భీమవరం వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలివి. పట్టణంలోని బ్యాంక్ కాలనీకి చెందిన గనిరెడ్డి రమేష్(29) గత మూడు రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. అతని భార్య ఈశ్వరి ఒక క్లాత్‌షోరూమ్‌లో పనిచేస్తోంది. శనివారం ఉదయం ఆమె 11 గంటల సమయంలో షాప్ నుంచి ఇంటికి రాగా రమేష్ దుప్పటితో సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతున్నాడు. వెంటనే రమేష్‌ను ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. లోకేష్ భార్య ఈశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై కె శ్రీనివాస్ చెప్పారు.

చెరువు మట్టి.. కొల్లగొట్టి



రాజవరం సమీపంలోని పులపాకుల చెరువు గర్భాన్ని తవ్విన దృశ్యం



యర్రంపేట సమీపంలోని చెరువులో ఇలా..

- కేసుల నమోదుకు అధికారుల వెనుకంజ



పోలసానిపల్లిలో మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

కొయ్యలగూడెం: మట్టి అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. సాగునీటి చెరువులే లక్ష్యంగా అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. కొయ్యలగూడెం మండలంతో పాటు సరిహద్దు మండలాల్లో ఇటుకల బట్టీలకు అక్రమార్కులు మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 15 రోజులుగా కొయ్యలగూడెంలోని పలు చెరువుల్లో రాత్రిళ్లు పొక్లెయిన్లతో మట్టిని తవ్వుతూ టిప్పర్లతో తరలించడంపై ఇరిగేషన్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. చెరువుల్లో గర్భాన్ని తవ్వి మట్టి తరలించినట్టు అధికారుల దర్యాప్తులో తేలింది. మెషీన్లు, టిప్పర్లను నెంబర్లతో సహా గుర్తించి కేసులు పెట్టేందుకు ఉపక్రమించారు. అయితే అధికారుల మధ్య సమన్వయ లోపంతో కేసులు పెట్టకపోవడం అనుమానాలకు తావిస్తోందని రైతులు అంటున్నారు. రాజకీయ కోణంలో ఒత్తిళ్లతోనే కేసులు పెట్టడం లేదనే ప్రచారం కూడా కూటమి నాయకులు చేయిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో మట్టి అక్రమ రవాణాకు కొందరికి అవకాశం ఇచ్చి మరికొందరికి ఇవ్వకపోవడంతో ఈ పంచాయితీ నియోజకవర్గ పెద్దల వద్దకు చేరింది. ఇదే అదునుగా అక్రమార్కులు ట్రాక్టర్ ట్రక్కుల్లో సైతం మట్టిని తరలిస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, మైనింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే అక్రమ రవాణాను అడ్డుకోవచ్చని చెరువుల ఆయకట్టు రైతులు అంటున్నారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

సాక్షి టాస్క్‌ఫోర్స్: భీమడోలు మండలం పోలసానిపల్లిలో ఓ చెర్వు నుంచి అక్రమంగా మట్టి యథేచ్ఛగా తరలిపోతోంది. ఇండ్ల స్థలాల మెరక పేరుతో ప్రైవేటు స్థలాలకు పగలు, రాత్రి తేడా లేకుండా బాహాటంగా ట్రాక్టర్లలో మట్టి తరలిస్తూ సొమ్ములు చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇలా మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల గ్రామంలోని డంపింగ్ యార్డు వద్ద మట్టితో అభివృద్ధి పనులు చేయించారు. ఇదే అదునుగా చెర్వులోని మట్టిని జేసీబీలతో తవ్వి పది ట్రాక్టర్లలో ప్రైవేటు స్థలాలకు రెండు రోజులుగా తరలించి సొమ్ములు చేసుకుంటున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై గ్రామ కార్యదర్శి యు.జయరామకృష్ణను వివరణ కోరగా గృహ నిర్మాణ శాఖ ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు మాత్రమే మట్టిని పంపిస్తున్నామని, ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడం లేదని తెలిపారు. నిబంధనలను ఉపేక్షిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏలూరు శాంతినగర్‌లో చోరీ

ఏలూరు టౌన్: స్థానిక శాంతినగర్ 4వ రోడ్డు ఆంధ్రాబ్యాంకు కాలనీలో చోరీ జరిగింది. ఈ కాలనీలో నివాసం ఉంటున్న ఆచంట రమేష్ అయ్యప్పమాల వేసి శబరిమల వెళ్లడంతో భార్య ఇంటికి తాళం వేసి పిల్లలతో బంధువుల ఇంటికి కొవ్వూరు వెళ్లారు. ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించిన పక్క ఇంటి వారు రమేష్ భార్యకు సమాచారం అందించగా శనివారం ఆమె వచ్చి దొంగతనం జరిగినట్లు గమనించారు. 17 కాసుల బంగారు నగలు, రూ.40వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

ఘనంగా కనక మహాలక్ష్మి అమ్మవారి రథోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని స్థానిక సత్యవతినగర్‌లో శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి 32వ వార్షికోత్సవ మహోత్సవం సందర్భంగా శనివారం అంగరంగ వైభవంగా రథోత్సవం జరిగింది. తొలుత ఆలయంలో ఉత్సవ కమిటీ వారిచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పండ్లు, పసుపు, కుంకుమలు సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ళ గోపికృష్ణ, జి.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరాల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమా లసేవ, ఉదయం అర్చనలు జరిపారు. ఆల య అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారికి తులసిమాలలు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నసమారాధన జరిపారు.

విద్యుత్ పొదుపు మనందరి బాధ్యత

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యుత్ వారోత్సవాలు సందర్భంగా జువ్వలపాలెం శివారు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ నరసింహరావు పర్యవేక్షణలో కార్యాలయం వద్ద విద్యుత్ పొదుపు వారోత్సవాలను శనివారం ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ వారోత్సవాలు ఈ నెల 20 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ పొదుపు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత తెలిపారు. విద్యుత్‌ను పొదుపు చేస్తే ఉత్పత్తి చేసినట్లే అని, ఆదా చేయడం ద్వారా ప్రకృతి సంపదను కాపాడినట్లు అవుతుందని చెప్పారు. వృధాను అరికట్టాలని, యూనిట్ పొదుపు రెండు యూనిట్లు ఉత్పత్తికి సమానమని, పర్యావరణాన్ని కాపాడదామని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏడీఈ రామకృష్ణ, ఏడీఈ ఎల్.గంగాధర్, పెంటపాడు ఏఈ పద్దరాజు, టౌన్ ఏఈ లీలావతి, విద్యుత్ సిబ్బంది, అకౌంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీదేవి పుంతలో అగ్ని ప్రమాదం



ఇంటి వద్దకు చేరిన స్థానికులు, అగ్ని ప్రమాద దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని జువ్వలపాలెం సమీపంలోని వార్డు నెంబర్ 16 శ్రీదేవి పుంతలో నారపరెడ్డి సూర్యప్రకాశ్‌కు చెందిన డాబాలోని డబుల్ బెడ్‌రూంలో శనివారం ఉదయం ఏసీ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. పొగ వ్యాపించడంతో చుట్టు ప్రక్కల వారు భవనం వద్దకు చేరారు. ఇంటిలోని వారికి ఎవరికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. ఘటన స్థలానికి ఫైర్ సిబ్బంది తణుకు ఎస్ఎఫ్ఓ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో చేరుకుని మంటలను అదుపు చేశారు. నష్ట వివారాలను రికార్డు చేశారు. పొగ వస్తుందన్న సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరినట్లు ఫైర్ సిబ్బంది వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఇంటిలోని హోంనీడ్స్, ఫర్నిచర్, బంగారు వస్తువులు, నగదు కాలిబూడిదఅయినట్లు తెలిపారు.

గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తణుకు అర్బన్: తణుకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ఆవరణలో శనివారం గంజాయి, మత్తు పదార్థాల ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సత్తి మణికంఠరెడ్డి మాట్లాడుతూ గంజాయి రహిత పట్టణంగా తణుకు ప్రాంతాన్ని తీర్చిదిద్దేందుకు ప్రజలంతా కృషి చేయాలని అన్నారు. గంజాయి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని, గంజాయి విక్రయాలపై పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా గంజాయి, డ్రగ్స్ రహిత తణుకు దిశగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తణుకు ఎక్సైజ్ శాఖ ఎస్ఐ ఆర్.మధుబాబు, హెడ్ కానిస్టేబుల్స్ కె .శ్రీనివాస్, ఎస్.అప్పలస్వామి, శ్రీమన్నారాయణ, కె.నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తణుకు టౌన్: తణుకు పట్టణానికి చెందిన కండిబోయిన నాగలక్ష్మీ అత్యవసర వైద్యం కోసం తణుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేసినట్లు ఆ సంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి తెలిపారు. శనివారం తణుకు రోటరీ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో నాగలక్ష్మీ అత్యవసర వైద్య సహాయం కోసం కుదప పట్టాభి, లక్ష్మి ఇచ్చిన ఆర్థిక సహాయం రూ.10 వేలు చెక్కును మానవత సంస్థ ద్వారా నాగలక్ష్మికి అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మానవత శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, కార్యదర్శి బీ రామకాశీ, కోశాధికారి అక్కిన కాశీ, వంగూరి హనుమంతరావు, ఆనందం మస్తాన్‌రావు, ఆలపాటి సుబ్బారావు, విశ్వనాథరాజు, పులమాల వీరభద్రం, మల్లిపూడి లక్ష్మి, ఆర్జి బాస్కరరావు, సుబ్రహ్మణ్యం, బీవీఆర్ ప్రసాద్, పీఆర్‌కే రాజు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

- రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు యంత్రాంగం కృషి
- తణుకులో రహదారుల్లో నిత్యం జాగ్రత్తలు సూచిస్తున్న వైనం
- యువతకు కౌన్సెలింగ్
- నిదానమే ప్రధానమంటూ ప్రచారం
- హెల్మెట్ ధరించాలని వినతి



తణుకులో హెల్మెట్ ధారణపై పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో నర్సింగ్ స్కూలు విద్యార్థినులు (ఫైల్)



తణుకులో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ కొండయ్య, ఎస్ఐ ఆదినారాయణ

తణుకు అర్బన్: హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి.. ట్రాఫిక్ నిబంధనలు పాటించండి ప్రమాదాలకు దూరంగా ఉండండి.. మీపై ఆధారపడ్డ మీ కుటుంబ సభ్యుల కోసం ఒక్కసారి ఆలోచించండి అంటూ పోలీసు అధికారులు రహదారుల్లో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిత్యం ఏదోపక్క జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు వాటిలో ప్రాణ నష్టంతో పాటు క్షతగాత్రులను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతిరోజూ తణుకు ప్రధాన రహదారుల్లో పోలీసు అధికారులు యువత, ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలను సూచిస్తున్నారు. అంతేకాకుండా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి విద్యార్థులకు చట్టాలకు సంబంధించిన అంశాలతోపాటు ట్రాఫిక్ నిబంధనలు, సురక్షిత ప్రయాణాలపై అవగాహన కల్పిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదమని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దంటూ పోలీసులు నిత్యం అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై తూనీగల్లా ప్రయాణిస్తూ ప్రయాణికులను ఢీకొడుతున్న ఆకతాయిలకు ముకుతాడు వేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డుల్లో ప్రతి సెంటర్‌లోను పోలీసు బీట్ నిర్వహిస్తూ వేగంగా ప్రయాణించే వాహనాలపై కన్నేసి ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

మానవ తప్పిదాలే ప్రమాదాలకు కారణాలా?

రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం మానవ తప్పిదాలతోనే ప్రాణ నష్టం సంభవిస్తుందా అంటే పోలీసు అధికారులు అవుననే చెబుతున్నారు. ముఖ్యంగా తణుకు జాతీయరహదారితో పాటు పట్టణంలోని రహదారుల్లో జరుగుతున్న చిన్నపాటి ప్రమాదాల్లో సైతం తలకు గాయమై ప్రాణాలు పోగొట్టుకుంటున్న ఘటనలు ఇటీవల కాలంలో చోటుచేసుకున్నాయి. ఒక మోస్తరు వేగంతో వెళ్లే ద్విచక్ర వాహనాలు సైతం అదుపు తప్పి డివైడర్‌పై పడిన సందర్భాల్లో వాహనదారుల తలకు గాయాలై ప్రాణా లు గాల్లో కలిసిపోతున్నాయి. కనీసం జాతీయ రహదారుల్లో ప్రయాణాల్లో సైతం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం ప్రమాదాలకు సంకేతాలిస్తున్నాయి.

ప్రమాదాల నివారణే లక్ష్యంగా



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు నిత్యం కొంత సమయాన్ని కేటాయిస్తున్నాం. వాహనదారులు, ఆటో డ్రైవర్లకు నిత్యం రహదారులపై అవగాహన కలిగించే ప్రయత్నం చేస్తున్నాం. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరుతున్నాం. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో అధికశాతం తలకు గాయాలై ప్రాణాలు పోతున్నాయి. దీంతో హెల్మెట్ తప్పనిసరి అంటూ ప్రచారం చేస్తున్నాం.

– ఎస్.కొండయ్య, తణుకు పట్టణ సీఐ

హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం ఉండదు



రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా తణుకు ప్రధాన రహదారుల్లో నిత్యం వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా మీరు బాగుంటేనే మీ కుటుంబం బాగుంటుందనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాం. వివిధ రోడ్డు ప్రమాదాల్లో కుటుంబాన్ని పోషించే పెద్ద చనిపోతే ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి తలెత్తుతోంది. అందుకని మీపై ఆధారపడ్డ వారి కోసమైనా మీరు హెల్మెట్ ధరించాలని, నిదానంగా ప్రయాణించాలని కోరుతున్నాం.

– డి.ఆదినారాయణ, తణుకు ట్రాఫిక్ ఎస్ఐ

ఘనంగా టీసీవై క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: క్రీస్తు బోధనలు మానవాళి మనుగడకు మార్గదర్శకమని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకు క్రిస్టియన్ యూత్ 25 వార్షిక యూత్ క్రిస్మస్ వేడుకలు స్థానిక సిల్వర్ జూబ్లి వంతెన ప్రాంతంలోని నూలి గ్రౌండ్స్‌లో శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి కారుమూరి మాట్లాడుతూ నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించమన్న క్రీస్తు సూచనలను పాటించాలని కోరారు. అనంతరం క్రైస్తవ భక్తుల మధ్య కారుమూరి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా అంతర్జాతీయ సువార్త గాయకులు ఏఆర్ స్టీవెన్‌సన్ యేసుక్రీస్తు గీతాలను ఆలపించగా, అంతర్జాతీయ ప్రసంగీకులు పాస్టర్ ప్రవీణ్ బైబిల్ వాక్యాలను ప్రసంగించారు. పాస్టర్ మనోజ్ బాబ్ అధ్యక్షతన, కన్వీనర్ మురాల సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టీసీవై క్రిస్మస్ వేడుకల్లో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, ఆనంద్, క్రైస్తవ సంఘ నాయకులు ఉందుర్తి నాని, పాస్టర్లు బ్లెస్సింగ్, బేస్ హం, జేమ్స్, తణుకు, ఇరగవరం, అత్తిలి, పెరవలి, ఉండ్రాజవరం,పెనుగొండ మండలాల పాస్టర్లు ఫెలోషిప్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు వల్లూరి రాజబాబు, తలారి గంగాధర్, ఎలిపే శేఖర్, అంబటి శ్యామ్ సాగర్, బింకం అనిల్ చక్రవర్తి పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి



తణుకులో ఫైలేరియా పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్ : ఫైలేరియా వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు ఫైలేరియా కంట్రోల్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మునిసిపాలిటీ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఫైలేరియా మాస్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎలిమినేషన్ దశకు చేరువులో ఉన్న ఫైలేరియా వ్యాధికి సంబంధించి రాత్రివేళ నిర్దేశించిన ప్రాంతాల్లో ఫైలేరియా మాస్ సర్వేను నిర్వహిస్తున్నటు చెప్పారు. ఫైలేరియా కంట్రోల్ యూనిట్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యన్నారాయణ మాట్లాడుతూ పరీక్ష నిమిత్తం రాత్రి సమయాల్లో రక్తనమూనాలు సేకరించి సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిస్తున్నామని, ఈనెల12వ తేదీన ప్రారంభమైన ఈసర్వే ఇప్పటి వరకూ తణుకు మునిసిపాలిటీ పరిధిలో కొమ్మాయి చెరువుగట్టు, ఇరగవరం మండలంలో గోటేరు, రేలంగి గ్రామాల్లో నిర్దేశిత ప్రాంతాల్లో పూర్తి చేశామని స్పష్టం చేశారు. వేల్పూరు, అత్తిలి, పాలి, సత్తారామేశ్వరం తదితర గ్రామాల్లోని గుర్తించిన ప్రాంతాల్లో ఈ సర్వేను సంబంధిత ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల క్షేత్ర స్థాయి సిబ్బందితో ఈనెల 25లోగా పూర్తి చేయనున్నట్లు వివరించారు. ఫైలేరియా వ్యాధి ఉచ్చరియా బాన్ క్రాఫ్టి నెమటోడ్ వలన ఇన్ఫెక్టెడ్ ఫీమేల్ క్యులెక్స్ దోమకాటు ద్వారా వస్తుందని, వ్యాధికారక క్రిమి శరీరంలో ప్రవేశించిన తర్వాత కొన్ని సంవత్సరాల తర్వాత గానీ వ్యాధి లక్షణాలు బయట పడవని, ఇది జ్వరంతో ప్రారంభమై చంకల్లో, గజ్జల్లో బిళ్లలు కట్టడడంతో మొదలై క్రమేణా అవయవాల వాపునకు దారి తీస్తుందని అన్నారు. ఇటువంటి లక్షణాలు ఉన్నపుడు వైద్యులను సంప్రదించాలని, ఈ వ్యాధిని వ్యాప్తి చేసే ఫీమేల్ క్యూలెక్స్ దోమ నిలకడగా ఉన్న మురుగు నీరుపై మాత్రమే గుడ్లు పెడతాయని, తదుపరి వారం నుండి పది రోజుల్లోగా దోమలుగా మారతాయని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పశువధకు అడ్డుకట్ట వేయకపోతే ఉద్యమిస్తాం



తణుకులో విలేకర్లతో మాట్లాడుతున్న భూపతిరాజు రామకృష్ణంరాజు

తణుకు టౌన్: అక్రమంగా పశువధ శాల నిర్మించి యథేచ్ఛగా పశువులను వధిస్తుంటే వ్యవస్థలు ఏం చేస్తున్నాయని ప్రకృతి వ్యవసాయ దారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రామకృష్ణంరాజు ప్రశ్నించారు. శనివారం తణుకులోని తుమ్మలపల్లి సత్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో 33 శాతం ఆదాయం వ్యవసాయం నుంచే వస్తుందని, అటువంటి వ్యవసాయ రంగంలో అనుబంధంగా ఉండే పాడి పశువులను ఇలా యంత్రాల ద్వారా వధిస్తే భవిష్యత్ రైతులకు ఆదాయం ఎలా పెరుగుతుందన్నారు. గో సేవా సమితి సభ్యుడు కొండ్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా పశువధ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోని అధికారులపైనే పోరాటం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోడూరి గిరీశ్వరరావు, జల్లూరి జగదీష్, సూరిపండు, చవ్వా శ్రీనివాసరాజా, తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం



మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సత్యవతి, చిత్రంలో న్యాయమూర్తులు

తణుకు అర్బన్ : రాజీ మార్గమే రాజమార్గమని, క్షణికావేశంలో చేసిన తప్పులను రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకే లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలిపారు. శనివారం తణుకు కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు 632 కేసులు రాజీ చేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ 597, సివిల్ 20, ప్రిలిటిగేషన్ కేసులు బ్యాంక్ 06, టెలిఫోన్ బకాయి కేసులు 09 రాజీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి డి.సత్యవతి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులల రాజీ చేసుకోవడం ద్వారా కక్షిదారులు తమ విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు పాతర్లంక సాయిరామ్, ఏవీ నాగ రాజు, బెంచ్ కోర్టు మెజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, న్యాయవాదులు, బ్యాంక్ అధికారులు, పోలీసు అధికారులు, ఎక్సైజ్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా

జాతీయ లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ లోక్ అదాలత్‌లను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా అన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలు మేరకు శనివారం స్థానిక కోర్టు భవనముల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. లోక్ ఆదాలత్‌లో నాలుగు బెంచ్‌లుగా ఏర్పాటు చేసి ఆయా కేసులను పరిష్కరించారు. షేక్ సికిందర్‌బాషాతో పాటుగా జడ్జిలు ఎస్.సూర్య కిరణ్ శ్రీ, డి.అరుంధతి, ఈ.అన్నామణిలు, అడ్వకేట్ సభ్యులు వి.లక్ష్మీనారాయణ, ఈ.మోష్, బి.వెంకటేశ్వరరావు, ఎన్.స్వామిలు కేసులను పరిశీలించారు. పరిష్కారం చూపారు. 767 కేసులు రాజీ అయ్యాయి. సివిల్ 22, క్రిమినల్ 224, ప్రమాదభీమాలు 7, బెంచ్ కోర్టు కేసులు 501, ప్రీ లిటిగేషన్ కేసులు బ్యాంక్, బీఎస్ఎన్ఎల్ కేసులు 13 రాజీ అయ్యాయి. లోక్ ఆదాలత్‌లో బార్ అధ్యక్షులు డీవీ విజయకుమార్, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీటి సంఘాల ఎన్నికలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో 14 నీటి సంఘాలకు శనివారం ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. ఆయా నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల వివరాలు ఇలా ఉన్నాయి. పెద్ద ట్యాంకు (పెదతాడేపల్లి) పసుమర్తి రామ త్రినాథరావు, పాతూరి కృష్ణారావు, చిన్నికుంట ట్యాంకు (దండగర్ర) వీరమళ్ల కోటేశ్వరరావు, నారపురెడ్డి రామారావు, వడపు చెరువు (వెంకట్రామన్నగూడెం) గోతం రాజు, ముళ్లపూడి వరలక్ష్మి, ఎర్ర కాలువ ఆయకట్టు (వీరంపాలెం-2) రెడ్డి రామిరెడ్డి, సమయమంతుల వెంకటరాజారత్నం, అంకాలమ్మ ట్యాంకు (కొండ్రుప్రోలు) జానా బాల బాలాజీ, వెలుగుల వెంకటేశ్వరరావు, కడియపు ట్యాంకు (కుంచనపల్లి) పట్టపగలు సత్యనారాయణ, కర్సి నపు రాజు, కోటమ్మ ట్యాంకు (ఆరుగొలను) కురెళ్ల నాగ వెంకటసత్యనారాయణ, చిక్కాల నాగమణి, కడియపు ట్యాంకు (ఆరుగొలను) వీరమళ్ళ పద్మావతి, గోపిరెడ్డి రాంబాబు స్వామి, మాతమ్మ ట్యాంకు (కొత్తూరు) ఉప్పు గంగాధర్, గోపిశెట్టి శ్రీనివాస్, ఎర్ర కాలువ ఆయకట్టు (వీరంపాలెం-1) గంధం ఏడుకొండలు, దూసనపూడి శ్రీనివాసు, తుమ్మవడపు ట్యాంకు (జగన్నాథపురం) కరుటూరి వెంకటరామారావు, కారుమూరి రాధాకృష్ణ, కోతిగుంట ట్యాంకు (జగన్నాథపురం), అడ్డగర్ల ప్రసాద్, కొప్పుల సత్యరత్నకుమారి, ఆకుమళ్ల ట్యాంకు (జగన్నాథపురం) శ్రీనివాసరావు, పంగిడి మోహనరావు, కొత్త చెరువు (జగన్నాథపురం) సిద్ధిన అప్పారావు, గెడ్డం విమల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఏకగ్రీవంగా నీటి సంఘాల ఎన్నికలు

తణుకు టౌన్: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు తహసిల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ తెలిపారు. శనివారం తణుకు మండలంలోని ముద్దాపురం, దువ్వ, తేతలి, మండపాక, తణుకు, తణుకు వేమవరం సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు తెలిపారు. ముందుగా ఆయా సాగునీటి సంఘాల పరిధిలోని ప్రాదేశిక సభ్యులకు ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు తెలిపారు. ఒక్కో నీటిసంఘానికి 12 మంది చొప్పున మండలంలోని ఆరు నీటి సంఘాలకు మొత్తం 72 మంది సభ్యులు ఎన్నికైనట్లు తెలిపారు.

అత్తిలిలో 12మంది ఎన్నిక

అత్తిలి: మండలంలో ఐదు సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరిగాయి. ఒక్కోసాగునీటి సంఘానికి 12 మంది చొప్పున నామినేషన్లు దాఖలు కావడంతో వీరంతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం సాగునీటి సంఘం ఎన్నికలలో సాగు నీటి సంఘ అధ్యక్షునిగా ఉరదాళ్లపాలెం గ్రామానికి చెందిన కూసంపూడి శ్రీనివాస్ ఏకగ్రీవంగా,ఉపాధ్యక్షుడిగా బల్లిపాడు గ్రామానికి చెందిన దాసం వీరవెంకట నాగ సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఆరవల్లి సాగునీటి సంఘం అధ్యక్షునిగా కోరుకొల్లు గ్రామానికి చెందిన గాదిరాజు వెంకటకృష్ణ సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షునిగా ఆరవల్లికి చెందిన వెలగల శివరామకృష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాలూరు నీటి సంఘ అధ్యక్షునిగా పెన్మెత్స పుల్లంరాజు, ఉపాధ్యక్షునిగా శీతాలం శేష గిరిరావు, అత్తిలి సాగునీటి సంఘం అధ్యక్షునిగా నల్లూరి సురేష్ కుమార్, ఉపాధ్యక్షునిగా బోడపాటి వీర వెంకట సత్యనారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పెంటపాడు: మండలంలో శనివారం నిర్వహించిన సాగునీటి ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్ తెలిపారు. పెంటపాడు నీటి సంఘానికి బండారు వెంకట్రావు (టీడీపీ), ఆకుతీగపాడు ఎం. సూర్యచంద్రరావు (జనసేన), ప్రత్తిపాడు కోలా మార్కండేయులు (జనసేన), మీనవిల్లూరు పుట్టా రమేష్ (టీడీపీ), రావిపాడు వంగూరి శివ (జనసేన), పడమర విప్పర్రు కుపసల గంగన్న (టీపీపీ), రాచర్ల కొండ్రెడ్డి వెంకట రామకృష్ణ (టీడీపీ) ఎన్నికయ్యారన్నారు. నూతనంగా సాగునీటి సంఘానికి ఎన్నికైన సభ్యులను పలువురు అభినందించారు.

14మంది సభ్యుల ఏకగ్రీవం

ఇరగవరం: ఇరగవరం మండలంలో నీటి సంఘాలకు శనివారం నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. మొత్తం 14మంది సభ్యులను ఎనుకున్నారు. ఈ ఎన్నికలను తహసీల్దార్, ఎస్ఐలు పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ ఈ ఎన్నికలకు దూరంగా ఉండటంతో ఆ పార్టీ శ్రేణులు ఎన్నికకు దూరంగా ఉన్నాయి. తెదేపా, జనసేన నాయకులు పదువులను పంచుకున్నారు. ఇరగవరం మండల నీటి సంఘ అధ్యక్షుడిగా నల్లా సురేంద్ర, ఉపాధ్యక్షుడు కొప్పిశెట్టి శ్రీనివాస్‌లు ఎన్నికైనట్లు తెలిపారు. ఎన్నికైన సభ్యులను పలువురు అభినందించారు.

గడ్డే బంగారమాయె!

- ఆకాశాన్నంటుతున్న ఎండుగడ్డి ధరలు
- సాగు విస్తీర్ణం తగ్గడంతో ఎండు గడ్డికి డిమాండ్
- ఎకరం గడ్డి రూ.7 వేల నుంచి రూ.10 వేలు
- ఇరగవరంలో అమ్మకానికి తీసుకువచ్చిన ఎండుగడ్డి



ఎండుగడ్డిని ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

ఇరగవరం: ఈ ఏడాది సార్వా సాగు ఆరంభం నుంచి కురుస్తున్న వర్షాలకు తోడు తుఫాన్‌ల ప్రభావంతో మండలంలో వరి సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. సాగు చేసిన పొలాల్లో కూడా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చేతికొచ్చిన పంట నేలపాలు కావడంతో అటు ధాన్యం తడిసిపోయి ఇటు ఎండు గడ్డి పనికి రాకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. మండలంలో సుమారు 640 ఎకరాల్లో సాగు చేపట్టగా పంట చేతికోచ్చే సమయంలో మరోసారి తుఫాన్ కారణంగా చేలు నేల రాలాయి. ఇటీవల తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ముందుగానే వరి కోతలు వేగంగా పూర్తి చేయాలనే ఉద్దేశ్యంతో యంత్రాలతో కోతలు కోయించారు. అయితే యంత్రాల ద్వారా కోసిన గడ్డి చిన్న చిన్న ముక్కలుగా ఉండటంతో పశువులు మేసేందుకు ఇష్టపడవు. మనుషులు చేత కోయిద్దామన్నా వాతావరణం అనుకూలించకపోవడంతో వరికోత మెషీన్లపైనే ఆధారపడ్డారు. దీంతో ఈ ప్రభావం ఎండు గడ్డిపై పడింది. మండలంలో తీవ్రస్థాయిలో ఎండుగడ్డి కొరత ఏర్పడిందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వరికోత మెషీన్ ద్వారా కోసిన గడ్డి ఎకరానికి రూ. 7 వేలు, మనుషులు కోసిన గడ్డి రూ.10 వేలు చొప్పున కృష్ణా జిల్లా, మన జిల్లాలోని కొన్ని ప్రాంతాల నుంచి ట్రాక్టర్ ద్వారా తీసుకొచ్చి నిల్వ చేసుకుంటామని పాడి రైతులు చెబుతున్నారు.


భారీగా తగ్గిన సాగు విస్తీర్ణం

మండలంలో గతంలో సార్వా రెండు వేల ఎకరాలు, దాళ్వా సాగు సుమారు మూడు వేల ఎకరాల్లో చేసేవారు. అయితే వివిధ కారణాలరీత్యా వ్యవసాయ రైతులంతా ఆక్వా రైతులుగా మారిపోయారు. మిగిలిన కొద్దిపాటి మంది రైతులు సాగు ప్రారంభంలో ప్రకృతి ప్రకోపానికి సాగుకు దూరంగా ఉన్నారు. దీంతో ఈ ఏడాది కేవలం 640 ఎకరాల్లో మాత్రమే సాగు చేపట్టారు. అయితే సాగు ఆరంభం నుంచి వరుణుడు వదలకపోవడంతో సాగు ఆలస్యమైంది. దీంతో ఇప్పటి వరకు కేవలం 140 ఎకరాల్లో మాత్రమే కోతలు పూర్తికాగా మిగతా భూములు కోయాల్సి ఉంది. అయితే గత నాలుగు రోజులుగా వర్షాలు కురవడంతో కోతలు మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కోసిన పనలు నీటిలో ఎక్కువ రోజులున్నా పశువులు ఆగడ్డిని తినవు. దీంతో ధర ఎంతైనా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

మండలంలో 16 వేల పశువులు

మండలంలో గిత్తలు, ఎద్దులు, ఆవులు కలిపి సుమారు 3,422 ఉండగా, గేదెలు సుమారు 13,262 ఉన్నాయి. ఈ పశువులు వేసవిలో నీటిని ఎక్కువుగా తాగుతాయి కాబట్టి రోజుకు కేవలం 3 లేదా4 కేజీల గడ్డి సరిపోతుంది. అదే వర్షాకాలం, శీతాకాలంలో రోజుకు 8 నుండి 10 కేజీల గడ్డి అవసరమవుతుంది. దీంతో అధిక ధరలు వెచ్చించి గడ్డిని కొనుగోలు చేయాల్సి వస్తుందని పాడి రైతులు వాపోతున్నారు.

గడ్డి దొరకడం కష్టంగా ఉంది



వరి కోత యంత్రాల ద్వారా కోయడంతో ఆ గడ్డి పశువులకు పని చేయదు. ఎక్కడ నుండైనా కొందామంటే దొరకని పరిస్థితి. తొందరగా ఒబ్బిడి చేసుకుందామనే ఆలోచనతో రైతులు వరికోత యంత్రాల వైపు మొగ్గుచూపుతున్నారు.

– ముసలయ్య, అర్జునపాలెం, సీపీఎం నాయకుడు

ఆల్ ఇండియా పెన్షనర్స్‌డేను పాటిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ పెన్షనర్స్ డే దినోత్సవం సందర్భంగా ఈ నెల 17వ తేదీన మంగళవారం పెన్షనర్స్‌కు వెలుగులు చూపిన డీఎస్ నకారా స్ఫూర్తితో ఆల్ ఇండియా పెన్షనర్స్‌డే పాటిద్దామని యూనిట్ అధ్యక్షుడు బి.హరికుమార్ వెల్లడించారు. శనివారం పెన్షనర్స్ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి పాటుపడిన సభ్యులకు సన్మానాలు, ఇతర సేవా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. పెన్షనర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.